ఆదాయం నిల్.. అభివృద్ధి కిల్

- గ్రామ పంచాయతీలకు వసూళ్లు కాని పన్నులు
- మండల పరిధిలో రూ. 4.34 కోట్లు బకాయి
- ప్రధాన కారణం కూటమి ప్రభుత్వ విధానమేనని ఆరోపణలు

పెనమలూరు: పెనమలూరు మండల పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీలకు ఆదాయం లేక అభివృద్ధి, పాలన కుంటుపడుతోంది. ఆయా గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నులను అధికారులు సకాలంలో వసూళ్లు చేయలేకపోవడంతో బకాయి పేరుకుపోయింది. అంతంత మాత్రంగా వసూళ్లు అవుతున్న పన్నులు గ్రామ పంచాయతీల పాలన ఖర్చులకు పోవడంతో అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకి వెళితే... పెనమలూరు మండలంలో వణుకూరు, గోసాల, గంగూరు, పెనమలూరు, చోడవరం, పెదపులిపాక గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో జిల్లాలోనే అతిపెద్ద మండలంగా ఉన్న పెనమలూరు తాడిగడప మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత చిన్న మండలంగా అవతరించింది. కేవలం ఆరు గ్రామ పంచాయతీలు మాత్రమే మండల పరిధిలో ఉన్నాయి. అయితే గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా పరిపుష్టత సాధించడానికి ఇతర వనరులు లేకపోవడంతో కేవలం ఇంటి పన్నులపైనే ఆధారపడి ఉన్నాయి.

పేరుకుపోయిన పన్నులు

మండల పరిధిలో గ్రామ పంచాయతీలకు ఇంటి పన్నుల బకాయి పేరుకుపోయాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో బకాయిలతో కలిపి వసూళ్లు చేయాల్సిన ఇంటి పన్నులు రూ. 4,34,55,100 ఉన్నాయి. ఇందులో బాకాయిగా ఉన్న పన్నులు రూ. 1,39,73,641 సకాలంలో వసూళ్లు చేయలేకపోవడంతో ఆయా గ్రామ పంచాయితీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. అంతంత మాత్రంగా వసూళ్లు అవుతున్న పన్నులు జీతాలకే సరిపోతున్నాయి. పన్నుల బకాయి పేరుకుపోవడానికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వ విధానమేనని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గతంలో ఇంటి పన్నులు వలంటీర్లకు టార్గెట్ అప్పగించడంతో పంచాయతీ సిబ్బందితో కలిసి వేగంగా వసూళ్లు చేసేవారు. ఇప్పుడు వలంటీర్లు లేకపోవడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. సచివాలయ సిబ్బందికి ఇతర పనులు, సర్వేలు అప్పగించడంతో పన్నుల వసూళ్లపై ఎవ్వరు దృష్టి పెట్టడం లేదు. దీంతో గ్రామ పంచాయతీలకు వనరులు లేక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయింది. గ్రామపంచాయతీ పాలనకులు నేడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చాలినంత ఆదాయ వనరులు లేకపోతే పాలన ఎలా సాగించాలని ఆయా గ్రామ పంచాయతీల పాలకులు సతమతమవుతున్నారు. మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో బకాయిగా ఉన్న పన్నుల వివరాలు పై పట్టికలో ఉన్నాయి.



పెనమలూరులోని సచివాలయ భవనాలు (ఫైల్)

గ్రామం	నివాసాలు	పన్నుల బకాయి	ప్రస్తుత బకాయి	రూ. మొత్తం పన్నులు
గోసాల	2,043	రూ. 5,41,707	రూ. 29,90,171	రూ. 35,31,878
పెదపులిపాక	1,604	రూ. 21,03,153	రూ. 48,96,324	రూ. 69,99,477
చోడవరం	1,072	రూ. 0	రూ. 13,20,738	రూ. 13,20,738
గంగూరు	1,671	రూ. 13,85,297	రూ. 56,44,445	రూ. 70,29,742
పెనమలూరు	4,232	రూ. 91,92,136	రూ. 1,23,70,681	రూ. 2,15,62,817
వణుకూరు	1,750	రూ. 7,51,348	రూ. 22,59,100	రూ. 30,10,448
		రూ. 1,39,73,641	రూ. 2,94,81,459	రూ. 4,34,55,100

ప్రత్యేక డ్రైవ్ ఒక్కటే మార్గం

గ్రామ పంచాయతీల ఆదాయం పెరగాలంటే పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు విడుదలయ్యే అవకాశం లేనందున ఆయా పంచాయతీలు మనుగడ సాగించాలంటే స్థానికంగా ఉన్న వనరులను ఖజానాలో సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కొత్తగా ఇంటి పన్నులు కావాల్సిన వారు గ్రామ పంచాయతీల చుట్టూ తిరిగినా పన్నులు వేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటి పన్నులు కొత్తగా వేయాలంటే అధికారుల చేతులు తడపాల్సిన పరిస్థితి ఉందని నివాసితులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో పారదర్శకత కొరవడటంతో నేడు గ్రామ పంచాయతీలు నిధులు లేక మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

సాగునీటి ఎన్నికల సిబ్బందికి శిక్షణ



కంకిపాడు: సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ వి.భావనారాయణ సూచించారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పూర్తి స్థాయిలో సమర్థంగా అమలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సహాయ అధికారులు పాల్గొన్నారు.

రేపు నీటి సంఘాల ఎన్నికలు

ఉంగుటూరు: మండలంలోని ఏడు నీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీ శనివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జె.విమల కుమారి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎన్నికల ప్రక్రియ వివరాలను వెల్లడించారు. మండలంలోని తేలప్రోలు, ఆత్కూరు, పేట ఆత్కూరు, మానికొండ, ఉంగుటూరు, ఇందుపల్లి, కొయ్యగూరపాడు గ్రామాల నీటి సంఘాల్లో 78 ప్రాదేశిక నియోజకవర్గాలకు (టీసీ)ఎన్నికలు శనివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతాయని చెప్పారు. పురుషులు 9,500, మహిళలు 5,500 మొత్తం 15వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వివరించారు.

క్లుప్తంగా

18న అమ్మవారి హుండీ లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని లాకుల సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఉన్నం వెంకటప్రసాదరావు తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ.. భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు ఆలయ ఆవరణలో జరుగుతుందన్నారు. గ్రామ పెద్దలు, హిందూ సేవాదళ్ సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు పాల్గొన వచ్చిని ఈఓ తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

గన్నవరం రూరల్: ఆరోగ్యంపై అందరికి అవగాహన ఉండాలని డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. గురువారం పురుషోత్తపట్నం వెల్‌నెస్ సెంటర్ వద్ద 104 వాహన వైద్య సేవలు గ్రామస్తులకు అందించారు. 50 మంది దీర్ఘకాల రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సమతుల ఆహారం మేలు చేస్తుందని, ఆహారంలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఉండాలని సూచించారు. వైద్య సేవల్లో వాహన సిబ్బంది పాల్గొన్నారు.

సేవా సదనం నిర్మాణానికి విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సేవాసదనం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన నర్రా కృష్ణారావు, కమల దంపతులు రూ. 1,00,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు భక్తులు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మ సేవాసదనం నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమవంతు సహకారం అందిస్తున్నట్లు శ్రీధర్ తెలిపారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి ఫణిశేఖర్ పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ–అవనిగడ్డ కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక గ్రామానికి చెందిన మంగిశెట్టి శ్రీనివాసరావు టైలరింగ్ పనులు చేస్తాడు. అతను రామలింగేశ్వరనగర్‌లో పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. అతను కరకట్టపై వెళుతుండగా గణపతినగర్ వద్ద వెనుక నుంచి వచ్చిన బైక్ అతడిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతనికి గాయలు అయ్యాయి. దీంతో అతడిని పటమటలోని ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు ఎనికేపాడులో జాబ్‌మేళా

గన్నవరం: విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడులో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఈ నెల 14వ తేదీ శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఈ జాబ్‌మేళాలో 50కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గానికి చెందిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కనకదుర్గనగర్‌లో ప్రత్యేక ఏర్పాట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు కలశజ్యోతులను సమర్పించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈఓ కెఎస్.రామరావు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 14వ తేదీ శనివారం కలశజ్యోతుల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో చేపట్టిన ఏర్పాట్లను ఈఓ రామరావు గురువారం పరిశీలించారు. కనకదుర్గనగర్ నుంచి గోశాల వరకు రోడ్డుకు ఒక వైపున జ్యోతులను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను ఈఓ పరిశీలించారు. మహామండపం మార్గంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతోపాటు భవానీలకు తాగునీరు, అమ్మవారి దర్శనంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఏర్పాట్ల వివరాలను దేవస్థాన ఈఈ వైకుంఠరావు ఈఓకు వివరించారు.

పాత్రికేయులకు అండగా వైఎస్సార్ సీపీ


శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఉయ్యూరు: పాత్రికేయులకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం పేర్కొన్నారు. ఇటీవల ఉయ్యూరులో గుండెపోటుతో పాత్రికేయుడు కె.శ్రీనివాసరావు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి మృతుడు శ్రీనివాసరావు కుటుంబానికి తన వంతుగా రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్లు గోన మధన్, ఎంఏ బేగ్‌లు గురువారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా కలాం మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ తోడుగా ఉంటుందన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చక్రవర్తి పేదలను ఆదుకోవడంలో ముందుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ రసూల్, సలీం బేగ్, బాషా, ఊరనాగిన్, అబ్దుల్ గఫూర్, అహ్మద్, గడ్డం చైతన్య, కాగిత శివ, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 45 అర్జీలు


అడంగల్ కాపీ అందజేస్తున్న అధికారులు


చిక్కవరంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు

కంకిపాడు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాదారు పాసుపుస్తకం మ్యూటేషన్‌కు రెండు, సర్వేకు ఏడు, సబ్ డివిజన్‌కు నాలుగు చొప్పున అర్జీలు అందాయి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ భాస్కర్ రావు, ఆర్ఐ ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిక్కవరంలో..

గన్నవరం రూరల్: చిక్కవరం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు కేవీ శివయ్య పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో వారసత్వంగా వచ్చిన భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, అడంగల్‌లో పేర్లు మార్పు చేయాలని 32 మంది అర్జీలు అందజేశారు. సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, నాయకులు చిట్టినేని జోజిబాబు, రేవూరి శివరామకృష్ణ, బీబీగూడెం ఉపసర్పంచ్ కాట్రు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు చర్యలు

కంకిపాడు: నూతనంగా మూడు కొత్త చౌక ధరల దుకాణాలను ఏర్పాటుచేసేందుకు నోటిఫికేషన్ విడుదలైందని తహసీల్దార్ వి.భావనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. మండలంలోని మద్దూరు (షెడ్యూల్ తెగలు), ప్రొద్దుటూరు (షెడ్యూల్ తెగలు), మంతెన (షెడ్యూల్ కులాలు–మహిళ)కు రిజర్వు అయ్యాయన్నారు. అర్హత గల నిరుద్యోగ యువత ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మండలంలో ఖాళీగా ఉన్న రెండు చౌక ధరల దుకాణాలకు నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. కంకిపాడు పట్టణం (అంధత్వం/తక్కువ దృష్టి, మహిళలు), గొడవర్రు (వినికిడి లోపం–ఓపెన్ కేటగిరీ)కి కేటాయించారన్నారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు ఈనెల 24లోపు ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయానికి చేరేలా సమర్పించాలని సూచించారు. రాత పరీక్ష ఈనెల 29న ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యూరు: ఉయ్యూరు మండలంలో రేషన్ దుకాణాల ఖాళీల భర్తీకి ఆర్డీఓ షారోన్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలంలోని ముదునూరు (బీసీ మహిళ), చిన ఓగిరాల (ఆర్థికంగా వెనుకబడిన విభాగం), ఉయ్యూరు పట్టణంలోని 7వ వార్డులో (బీసీ–ఏ, మహిళ), 3, 6 వార్డుల పరిధిలో (ఓపెన్ కేటగిరీలో స్పోర్ట్స్ పర్సన్), 16వ వార్డులో (బీసీ–ఏ), 13, 14 వార్డుల్లో (షెడ్యూలు తెగలు–మహిళ), 10, 12 వార్డుల్లో (బీసీ–బీ, మహిళ)కు రిజర్వు అయ్యాయని పేర్కొన్నారు.

నున్నలో ఉపాధి హామీ పథకం గ్రామ సభ


గ్రామ సభలో అధికారులు

నున్న(విజయవాడరూరల్): జాతీయ ఉపాధి హామీ పథకంలో 2024–25వ సంవత్సరానికి సంబంధించి నున్న గ్రామంలో 50వేల పనిదినాలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించబడిందని ఆ పథకం ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ వి.శ్రీనివాసరావు అన్నారు. నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన గురువారం ఉపాధి హామీ పథకం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గ్రామంలో చెరువులు, కాల్వల పరిధిలోని పంట బోదులు అభివృద్ధి చేయడం, మామిడితోటల్లో నీట కుంటలు, ఇంకుడు గుంతలు తవ్వడం పనులు ప్రతిపాదించామన్నారు. రైతులకు పశువుల షెడ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉందని అయితే లబ్ధిదారులు షెడ్లు నిర్మాణంలో 10 శాతం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామసభలో ఉపసర్పంచి కె. బ్రహ్మానందరెడ్డి, పంచాయితీ పాలకవర్గ సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాసరావు, కలకోటి శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


కాల్వగట్టు ప్రాంతంలో అక్రమ నిర్మాణం కూల్చివేసిన పంచాయతీ అధికారులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు కాల్వగట్టు ప్రాంతంలో ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడంపై గురువారం పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. గ్రామానికి చెందిన మహిళ గతంలో బసవతారక అభ్యుదయ మహిళా మండలి పేరుతో ఇరిగేషన్ స్థలంలో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి స్వార్థ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారంటూ ఈ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తాకు ఫిర్యాదు అందింది. దీంతో ఆక్రమణను పరిశీలించి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేశారు. కాల్వ కట్టపై మిగిలున్న ఆక్రమదారులకు కూడా నోటీసులు జారీ చేయడానికి సిద్ధపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. నోటీసులు జారీ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వివరించారు.

వైద్య ఖర్చులకు ఎల్‌వోసీ

పెనమలూరు: వైద్య ఖర్చులకు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌వోసీ ఉత్తర్వులను బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పెదపులిపాకకు చెందిన షేక్ బేగంకు రూ. 4 లక్షలు, ఉయ్యూరుకు చెందిన షేక్ షయాన్‌షాజిల్‌కు రూ. 10 లక్షలు, పోరంకికి చెందిన వంగూరు సారథికి రూ. 1.50 లక్షల ఎల్‌వోసీ వైద్య ఖర్చులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, ముసునూరు శ్రీనివాసరావు, రామ్‌కుమార్, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని ప్యాసింజర్ రైళ్లు

- రైల్వేస్టేషన్ ఉన్నా అందని రైల్వే సేవలు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


తెన్నేరు రైల్వేస్టేషన్‌లో ఆగకుండా వెళ్తున్న ప్యాసింజర్ రైలు

కంకిపాడు: సింగిల్ లైన్‌గా ఉన్న విజయవాడ – నరసాపురం రైల్వే లైను డబుల్ లైన్‌గా అభివృద్ధి జరిగింది. కోట్లాది రూపాయలు వెచ్చించి రైల్వే లైన్ విస్తరణ పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో రయ్ రయ్ మంటూ రైళ్లు దూసుకుపోతున్నాయి. అయితే గ్రామీణులకు అందుబాటులో ఉండే పలు ప్యాసింజర్ రైళ్లు తెన్నేరు, ఉప్పలూరు రైల్వే స్టేషన్లలో ఆగడం లేదు. రైల్వే స్టేషన్లు సమీపంలోనే ఉన్నా రవాణా సదుపాయం లేనట్లుగా తయారైందని ప్రయాణికులు వాపోతున్నారు.

కరోనా తర్వాత మారిన పరిస్థితులు..

ఒకప్పుడు విజయవాడ – గుడివాడ – నరసాపురం రైల్వే లైను సింగిల్ లైన్‌కే పరిమితం. మూడేళ్ల క్రితం ఈ మార్గం డబుల్ లైన్‌గా విస్తరణ పనులు పూర్తయ్యాయి. ఈ మార్గం వెంబడి ఉన్న రైల్వేస్టేషన్లలో అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పించారు. అయితే కరోనాకు పూర్వం వరకూ నడిచిన పలు ప్యాసింజర్ రైళ్లు రైల్వే స్టేషన్లలో ఆగడం లేదు. ప్రత్యేకించి తెన్నేరు రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఉన్న మారేడుమాక, తెన్నేరు, మంతెన పరిసర గ్రామాల ప్రజలకు ప్యాసింజర్ రైళ్లు ఆగకపోవడంతో రవాణా సదుపాయాలు కష్టంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. విజయవాడ వైపునకు ఉదయం 6.05 గంటలకు వెళ్లే మచిలీపట్నం – విజయవాడ సర్వీసు, మధ్యాహ్నం 12.20 గంటలకు వెళ్లే నరసాపురం – విజయవాడ సర్వీసు, సాయంత్రం 4.10కి నరసాపురం – విజయవాడ సర్వీసులు ఆగడం లేదు. సాయంత్రం వేళ గుడివాడ వైపునకు వెళ్లే సర్వీసుల్లో 4.15 గంటలకు విజయవాడ – నరసాపురం, 6.45 గంటలకు వెళ్లే గుంటూరు – నరసాపురం ప్యాసింజర్ రైళ్లు ఆగడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ సమస్య కంకిపాడు – గన్నవరం రోడ్డు వెంబడి ప్రధాన స్టేషన్‌గా ఉన్న ఉప్పలూరు స్టేషన్‌లోనూ నెలకొందని, ఇక్కడ కూడా కొన్ని ప్యాసింజర్ రైళ్లు ఆగడం లేదని చెబుతున్నారు.

ప్రయాణానికి అవస్థలు..

ప్యాసింజర్ రైళ్లు ఆగకపోవడంతో ఉదయం విజయవాడలో ఉపాధి, విద్య, ఉద్యోగ అవసరాల నిమిత్తం వెళ్లే ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అదే విధంగా సాయంత్రం వేళల్లోనూ ఇళ్లకు చేరుకోవాలన్నా, ప్రధాన పట్టణాలకు చేరుకోవాలన్నా రైలు ప్రయాణం చేయలేకపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. వసతులు కల్పించినా, సేవలు అందకపోతే ప్రయోజనం ఉండని ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా..

ప్యాసింజర్ రైళ్లు ఆగకపోవడంపై రెండు నెలల క్రితం తెన్నేరు గ్రామస్తులు స్థానికంగా ఉన్న డిమాండ్‌ను తీర్చాలంటూ రైల్వే ఉన్నతాధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు సంతకాలు సేకరించి వినతిపత్రాన్ని పంపారు. అయినా నేటి వరకూ సమస్య పరిష్కారానికి నోచుకోలేదంటూ వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్యాసింజర్ రైళ్లు ఆయా స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైళ్లు ఆగడం లేదు..



తెన్నేరు రైల్వేస్టేషన్, ఉప్పలూరు రైల్వేస్టేషన్‌లకు మధ్యన మా గ్రామం ఉంటుంది. సమీపంలో స్టేషన్లు ఉన్నా కొన్ని ప్యాసింజరు రైళ్లు చాలా వరకూ ఆగడం లేదు. చేసేది లేక ప్రైవేటు వాహనాలను, సొంత వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్యాసింజర్ రైళ్లు ఆయా స్టేషన్లలో పూర్తి స్థాయిలో ఆగేలా చూడాలి.

– ఉప్పలూరు శ్రీనివాసరావు, మంతెన


ప్రయాణికుల అవస్థలను గుర్తించాలి



ప్యాసింజర్ రైళ్లు ఆగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రధానంగా కూలీలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ప్యాసింజరు రైళ్ల రాకపోకలపై తగు చర్యలు తీసుకోవాలి. అప్పుడే రైల్వే సేవలు పూర్తి స్థాయిలో అందుతాయి.

– వీరంకి రాంబాబు, మంతెన

వాలీబాల్ టోర్నీతో నగరానికి క్రీడా శోభ



విజయవాడస్పోర్ట్స్: జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీతో విజయవాడకు క్రీడా శోభ సంతరించుకుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియంలో నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎంబీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ గురువారం సాయంత్రం ప్రారంభమైంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఈ పోటీలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీ మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, తమిళనాడు క్రీడా ప్రాధికార సంస్థ, జేఈపీఏఐఆర్ యూనివర్సిటీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, పీకేఆర్ యూనివర్సిటీ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా టాప్ ప్లేస్‌లో ఉన్న 80 శాతం వాలీబాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని వివరించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు రూ. 2.75 లక్షల నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు తదితరులు పాల్గొన్నారు.